ఆర్‌ఎస్‌ఎస్ ఆటలు సాగనివ్వం
ప్రపంచీకరణకు కేరళ విధానం ప్రత్యామ్నాయం
–అందుకే కేరళపై బిజెపికి కక్ష
బిజెపి మతోన్మాద చర్యలను అడ్డుకుంటాం
–క్షేత్రస్థాయి పోరాటాలతో అడ్డుకట్ట
–జిఎస్టీ పేరుతో కార్పొరేట్లకు లక్షన్నకోట్లు లబ్ధి
కేరళ ఆర్థికశాఖ మంత్రి డాక్టర్ థామస్ ఐజాక్

కేరళలో సిపిఎం ప్రభుత్వ పాలన ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయంగా ఉందని, అందువల్లే బిజెపి తమపై కక్ష కట్టి తప్పుడు ప్రచారం చేస్తోందని కేరళ ఆర్థికశాఖా మంత్రి డాక్టర్ థామస్ ఐజాక్ అన్నారు. దాన్ని దెబ్బతీసేందుకు అక్కడ మతోన్మాద పూరిత చర్యలకు దిగుతోందన్నారు. దీన్ని కేరళ ప్రజలు అంగీకరించరన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'మతోన్మాదం– సవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో థామస్ ఐజాక్ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పచ్చి కార్పొరేట్ అనుకూల విధానాల్ని అనుసరిస్తోందని, వాటి దోపిడీపై ప్రజల్లో ఆలోచన రాకుండా ఉండేందుకు రకరకాల పేర్లతో మతోన్మాద చర్యలకు దిగుతోందన్నారు. దేశంలో ఇప్పుడున్న పరిస్థితుల్లో నయా ఉదారవాద విధానాలను కాంగ్రెస్ కంటే వేగంగా బిజెపి అమలు చేస్తోందని, అందుకనే కార్పొరేట్ శక్తులు బిజెపికి అనుకూలంగా మారాయన్నారు. గతంలో పెట్టుబడిదారులు కొద్దిమొత్తంలో వచ్చే ఆదాయంతో లాభపడేవారని, ప్రస్తుతం లక్షల కోట్ల దోపిడీకి పాల్పడుతున్నారని, వారికి బిజెపి అండగా ఉంటోందని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన జిఎస్టీ కూడా అందులో భాగమేనన్నారు. దీనివల్ల ఒకే ఏడాదిలో కార్పొరేట్‌శక్తులకు లక్షన్నర కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. చిన్న వ్యాపారులపై భారాలు మోపి పెద్ద వ్యాపారులకు కట్టబెట్టే ధోరణి అనుసరిస్తోందన్నారు. అదే సమయంలో సంక్షేమం నుండి తప్పుకుంటోందన్నారు. కేరళ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అక్కడున్న సంప్రదాయ వృత్తుల్ని అభివృద్ధి చేసేందుకు ఆయా రంగాల్లో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆహ్వానించామన్నారు. ఇవన్నీ గిట్టని సంఘ్ పరివార్ శక్తులు కేరళలో సిపిఎంని టార్గెట్ చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలను కులం, మతం, జాతి పేరుతో విడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, దీన్ని తాము అడ్డుకుంటున్నందునే తమపై దాడులకు దిగుతున్నారన్నారు. మతం ప్రజలను విడగొడుతుందని, విభేదాలు సృష్టిస్తుందన్నారు. ప్రజల భావాలపై మత ఆధిపత్యాన్ని రుద్ది దానిద్వారా పెత్తనం చేయాలనే కుట్రతో బిజెపి వ్యవహరిస్తోందన్నారు. దీనికోసం మీడియానూ వాడుకుంటోందని, ఆయా సంస్థలను బెదిరించి లంగదీసుకుని తప్పుడు ప్రచారం చేయిస్తోందన్నారు. లంగని సంస్థలపై కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతోందన్నారు. బిజెపి చర్యలకు తాము భయపడేది లేదని, ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేరళ ప్రజలు కూడా బిజెపి ఉన్మాద చర్యల్ని అర్థం చేసుకుంటున్నారని, స్థానిక ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపించిందన్నారు. వాస్తవంగా భారతదేశ చరిత్రలో ఎక్కడ కూడా మతం పేరుతో ఘర్షణలు జరిగిన దాఖలాల్లేవన్నారు. అప్పట్లో రాజ్యాలను ఆక్రమించి సంపదను తరలించుకుపోవడమే ప్రధానంగా ఉందన్నారు. ప్రస్తుతం బిజెపి చెబుతున్నట్లుగా చరిత్రలో మతపరమైన చర్యలకు తావులేదన్నారు. బ్రిటీష్ పాలకులు వారి స్వార్థం కోసం ప్రజలను విభజించి పాలించే పద్ధతిని అనుసరించారని, అప్పుడే ముస్లింలీగ్, హిందూ మహాసభలు ముందుకొచ్చాయని పేర్కొన్నారు. హిందూ మహాసభలో ఉన్న నాయకులెవరికీ భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గన్న చరిత్ర లేదన్నారు. ఆయా సంస్థలను ప్రోత్సహించి బ్రిటీష్‌వాళ్లు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. దేశంలో హిందూ విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలనే హిట్లర్, ముస్సోలిని వంటి వారి విధానాలను అనుసరించాలని బంచ్ ఆఫ్ థాట్స్ అనే పుస్తకంలో గోల్వాల్కర్ పేర్కొన్నారన్నారు. జనసంఘ్ పేరుతో ముందుకొచ్చినా ప్రజలు వారిని ఆదరించలేదన్నారు. గాంధీని హత్య చేయడంతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయి, పార్టీ పేర్లు మార్చుకుని దేశంలో పాతుకుపోయేందుకు కుట్ర పూరిత చర్యలకు దిగారన్నారు. కాంగ్రెస్ పార్టీ

ఏకఛత్రాధిపత్యం కోల్పోయిన సమయంలో జనతాపార్టీ పేరుతో ముందుకొచ్చారన్నారు. అందులోనూ విడిపోయి బిజెపిగా అవతరించారని ఆయన పేర్కొన్నారు. సంఘ్ పరివార్ పేరుతో బిజెపిని, ఇతర మతోన్మాద సంస్థలను ఆరెస్సెస్ నడిపిస్తోందన్నారు. బిజెపి ఏర్పాటైన తరువాత తొలుత వాజ్‌పేయి విధానాలు పాటించారని, అవి విజయవంతం కాకపోవడంతో అద్వానీ రథయాత్ర పేరుతో దేశం మొత్తం మతపరమైన విద్వేషాల్ని రెచ్చగొట్టారన్నారు. వాటినీ తలదన్నే విధంగా ఇప్పుడు మోడీ ముందుకొచ్చి అత్యంత పాశవికంగా ఫాసిస్టు పద్ధతుల్ని అనుసరిస్తున్నారన్నారు. గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మతం పేరుతో ముస్లింలను ఊచకోత కోయించారని, అదే గొప్ప విజయంగా బిజెపి నేతలు మోడీని ప్రధానిని చేశారని పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత కార్పొరేట్ శక్తుల దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు. గత మూడేళ్లుగా కార్పొరేట్ దోపిడీని ప్రశ్నించాలనే ఆలోచన ముందుకు రాకుండా చేయడంలో గోవధ అంశాన్ని అత్యంత విజయవంతంగా ఉపయోగించుకున్నారన్నారు. ఈ విధానాలన్నీ కూడా కార్పొరేట్ సంస్థల దోపిడీపై చర్చ లేకుండా చేస్తుండడంతో వ్యాపారులు కూడా మోడీని నెత్తినెత్తుకుని మోస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగాన్ని అతి తక్కువ ధరకు కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, బిజెపి అనుసరిస్తున్న విధానాలను అక్కడ తిప్పి కొట్టడంతో తట్టుకోలేక ఫాసిస్టు తరహా దాడులకు దిగుతోందన్నారు. మనలాంటి ప్రజాతంత్ర భావాలున్న దేశంలో ఫాసిస్టు విధానాలు కొనసాగిస్తే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు.

**ఉద్దేశపూర్వకంగానే దాడికి దిగుతున్నారు: సిపిఎం కార్యదర్శి మధు**

సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై బిజెపి, దాని అనుబంధ సంఘాలు ఉద్దేశపూర్వక దాడికి దిగుతున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గుంటూరులో ఐజాక్ సభను అడ్డుకోవాలని పోలీసులకు హిందూ సేన పేరుతో వినతిపత్రమిచ్చారని, వారికి ఎంత ధైర్యమని ప్రశ్నించారు. దీన్ని చూస్తూ ఊరుకోబోమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మంత్రి థామస్ ఐజాక్‌ను వేదికమీదకు ఆహ్వానించారు.

వైసిపి కూడా బిజెపికి తొత్తుగా మారింది:సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపితోపాటు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ కూడా బిజెపికి తొత్తుగా మారడమేమిటో అర్థం కావడం లేదన్నారు.